# అద్దరి

నన్ను అనవసరంగా మా సంస్థలోని అవినీతి నిరోధక శాఖలోకి పంపించారని పిస్తుంటుంది. కరుకుగా ఉండే మనస్తత్వం కాదు నాది. కొన్ని సమస్యలకు గొంతు బిగుసుకుపోయి ఊపిరాడదు. ఏ అవినీతి అయినా మా దృష్టికి రాత పూర్వకంగా వచ్చాక దాని గురించి ఆరా తీయకుండా ఉండక తప్పదు. చిన్న విషయమయితే పిలిచి వార్నింగ్ ఇచ్చి పంపించేశాడని బయటపడితే శిక్ష పడుతుంది. ఒక ఇంక్రిమెంటు పోతుంది. లేదా ప్రమోషన్‌కు గండి పడుతుంది. కార్మిక నాయకుల ప్రమేయం, అండ ఉన్న సమయాల్లో తప్పు పక్కదారి పడుతుంది. అవినీతిలో పవిత్రమయిన విషయం ఏమిటంటే తిమింగలాలు ఎప్పుడూ తప్పించుకుంటాయి. చిన్న ఉద్యోగులు మటుకు దొరికిపోతుంటారు. మేమేదో చేయాలి. కేసులు చూపించాలి. మాది పెద్ద కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ కాబట్టి ఎక్కడో ఒకచోట ఏదో ఒకటి జరుగుతూనే ఉంటుంది. ఆగవు.

రాజనరసయ్య గత ఇరవయి సంవత్సరాలుగా మా సంస్థలో పనిచేస్తున్నాడు. అతని మీద మాకెవరో ఆకాశరామన్న ఉత్తరం రాశారు. అందులోని విషయం ఏమిటంటే అతని తలిదండ్రులు చనిపోయి పదమూడు సంవత్సరాలయినా వాళ్లపేర అతను లీవ్ ట్రావెల్ కన్‌సెషన్ తీసుకుంటున్నాడు.

పర్సనల్ డిపార్టుమెంటు నుండి అతని ఫైలు తెప్పించి చూశాను. అతను ఉండేది సదాశివపేటలో, రోజూ అక్కడి నుండి కంపెనీ బస్సులో వస్తుంటాడు. నా అసిస్టెంటును తీసుకుని వాళ్ళ ఊరు వెళ్లి ఆరాతీస్తే ఆకాశరామన్న ఉత్తరంలోని ఆరోపణలు నిజమని తెలిసింది. మా చీఫ్‌కు చెప్పి రెండు రోజులు ఆగి రాజనరసయ్యను మా ఆఫీసుకు పిలిపించాను. ఏడో సందర్భంలో అతనితో లోగడ మాట్లాడాను. వ్యక్తి

సాత్వికుడు కాదు. ఎప్పుడు పోట్లాటకు దిగుదామా అన్నట్టు ఉంటాడు. కూర్చోమన్నాను. ఇబ్బందిగా కూర్చున్నాడు. మాకు వచ్చిన ఉత్తరాన్ని అతనికి ఇచ్చాను. ఒకటికి రెండుసార్లు చదువుకుని, తల అడ్డంగా ఆడించి, “ఇందులో నిజం లేదు” అన్నాడు. మాట కఠినంగా ఉంది. గుప్పిటితో బల్లమీద చిన్నగా గుద్ది, “ఇదెవరో నేనంటే గిట్టనివాళ్లు రాసి ఉంటారు. అయినా నాకు తెలియక అడుగుతున్నాను. ఇలాటి ఆకాశరామన్న ఉత్తరాలు మీరెలా పరిగణలోకి తీసుకుంటారు?” కోపంగా అడిగాడు.

“తీసుకోకూడదని లేదు. తీసుకుని ఆరా తీయవచ్చు. మూడు రోజుల కిందట మీ ఊరెళ్లి వాకబు చేసి నిజం తెలుసుకున్న తర్వాత నిన్ను పిలిచాను” అని అతను తండ్రి, తల్లి ఏఏ సంవత్సరాలల్లో, నెలల్లో, తేదీల్లో చనిపోయారో చెప్పాను. అతను ఈ విషయం ఊహించి ఉండడు. కొద్దిసేపు మాట్లాడకుండా కూర్చుని, నేను అతనికిచ్చిన ఉత్తరాన్ని తిరిగి నా చేతికి ఇచ్చేస్తూ “నేనంటే మీకు కోపమా?” చిన్నగా అడిగాడు. మాట మెత్తబడింది.

“నీమీద కోపం ఎందుకు, మనిద్దరం ఎప్పుడయినా పోట్లాడుకున్నామా?” నా కంఠస్వరం కొద్దిగా పెంచాను.

“లేదు. కొన్నిసార్లు మీ విజిలెన్స్ వాళ్లే ఆకాశ రామన్న త్తరాలు రాస్తుంటారని విన్నాను”

అతను అన్న మాటలో అబద్ధం లేదు. లోగడ మా శాఖలో గంగాధర శాస్త్రి అనే అతను పనిచేశాడు. అతను తనకు గిట్టని వాళ్లమీద ఆకాశరామన్న ఉత్తరాలు రాసేవాడు. రాయించేవాడు. నానా యాగీ చేసేవాడు. అతని స్థానంలో నేను వచ్చి నందుకు నామీద కూడా రెండు మూడు ఉత్తరాలు రాశాడు. ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు.

తల అడ్డంగా ఆడించి, “ఎందుకు రాస్తారయ్యా, అంత అవసరం ఏమొచ్చిందని? నీకు తెలిసిన వాళ్ళెవరో రాసి ఉండొచ్చు కదా” అన్నాను.

కుర్చీ ముందుకు జరుపుకుని, “ఈవిషయంలో నాకు సహాయం చేయలేరా?” ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

“నువ్వు నీ తలిదండ్రుల పేరున తీసుకున్న డబ్బులు తిరిగి కంపెనీకి కట్టేసే పక్షంలో నీకు సెన్సూర్ ఇచ్చి వదిలి వేస్తారు.”

"సెన్సుర్ అంటే?"

"రాత పూర్వక వార్నింగ్"

"వచ్చే జూన్‌లో నాకు ప్రమోషన్ ఉంది. సెన్సుర్ దానికేం అడ్డు రాదు కదా?"

అతని ప్రశ్న విననట్టు బల్ల పొరుగు లోంచి రెండు తెల్లకాయితాలు తీసి అతనికిచ్చాను. "తప్పయిపోయింది. ఇటువంటి పనులు మళ్లీ చేయను. వీలయినంత త్వరలో తలిదండ్రుల పేరున తీసుకున్న తిరిగి కంపెనీకి చెల్లించేస్తాను అని రాసివ్వగలవా?" అడిగాను.

"రాసివ్వకపోతే?"

"ఏంకాదు. కేసు నడుస్తుంది. మీ తలిదండ్రుల డెత్ సర్టిఫికెట్లు మా దగ్గర ఉన్నాయి."

ఏమనుకున్నాడో ఏమో తన తప్పు ఒప్పుకుంటూ రాసి డబ్బులు తిరిగి కట్టేయడానికి కొంత సమయం కావాలని కోరాడు. తెలుగులోనే రాశాడు. అంత తేలికగా అతను స్టేట్‌మెంట్ రాసిస్తాడని నేను అనుకోలేదు. కొంతమంది గొడవ పెడుతుంటారు.

ఆ సాయంత్రం నోట్ టైప్ చేయించి విజిలెన్స్ ఆఫీసర్‌గా సంతకం పెట్టి మా చీఫ్‌కిచ్చాను. కార్మిక నాయకులు ఎక్కడో ఒకచోట పట్టుబడడం మా మేనేజ్‌మెంటుకు ఎంతో ఇష్టమయిన విషయం. ప్రతి సంస్థలోనూ అలానే ఉంటుందేమో నాకు తెలియదు. రాజనరసయ్య తక్కువ వాడేంకాదు. ప్రమోషన్లకు, బదిలీలకు, టౌన్‌షిప్‌లో క్వార్టర్స్ ఎలాట్‌మెంట్లలో, షాపులకిచ్చేప్పుడో ఉద్యోగుల దగ్గర డబ్బులు బాగానే గుంజుతాడని విన్నాను.

నాలుగో రోజున ముగ్గురు కార్మిక నాయకులు మా చీఫ్ గదిలోకి వచ్చిన అరగంట తర్వాత ఆయన నన్ను పిలిచాడు. వెళ్లాక, "వీళ్లు నీకు తెలుసుకదూ?" అడిగాడు. మా చీఫ్ కొద్దిగా భయస్తుడు. వీలయినంత వరకు ఏ గొడవ రాకుండా చూసుకుంటాడు. నవ్వి, తెలుసన్నట్టు తలూపాను. ఒకతను మల్లయ్య. రూలింగ్ యూనియన్ అధ్యక్షుడు. రెండో అతను ముబారక్. సెక్రటరీ, మూడో అతను కమిటీ సభ్యుడు. వాళ్లంటే మా జనరల్ మేనేజర్లు భయపడుతుంటారు. మా యూనియన్

ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ వాళ్ల మాటలను తీసివేయడు. ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టుల నుండి సబ్ కాంట్రాక్టుల వరకు జరిగే కార్యకలాపాల్లో వాళ్ల ప్రమేయం ఉంటుంది.

"రాజనరసయ్య కేసు విషయమయి వచ్చారు. సెటిల్ చేయి... నేను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గారి దగ్గరకు వెళ్లి పావుగంటలో వచ్చేస్తాను. మీటింగు ఉంది" అని నా భుజం తట్టి చీఫ్ వెళ్లిపోయాడు. ఆ పరిస్థితి నుండి తప్పించుకునే ప్రయత్నం అది. ఆయన్ని నేను ఆపలేను. కుర్చీ వాళ్ల దగ్గరకు లాక్కుని కూర్చున్నాను.

"నీకు తెలుసో లేదో రాజనరసయ్య మా యూనియన్‌లో ఏక్టివ్ మెంబరు. పొరపాటు చేయలేదని నేను అనడం లేదు. నువ్వేం చేస్తావో నాకు తెలియదు. అతని మీద కేసులేకుండా చూడు." నవ్వు ముఖంతో అన్నా మాటలు కఠినంగా ఉన్నాయి.

మల్లయ్య నాకు మరీ కొత్త వాడుకాదు. కోద్దో గొప్పో పరిచయం ఉంది. "మల్లయ్యన్నా నేను చెప్పేది విని, ఆలోచించి అప్పుడు నన్నేం చేయమంటావో చెప్పు. రాజనరసయ్య నీ ప్రత్యర్థి గుండూరావుకు కావలసిన మనిషి. నాలుగేళ్ల కిందటి వరకు అతని యూనియన్‌లో ఉండి నీ దగ్గరకు వచ్చాడు. రాబోయే ఎన్నికల ముందు మళ్లీ అటు దాటొచ్చు అనే మాట వింటున్నాను. నిజం కావచ్చు. కాకపోవచ్చు. అతనికి దగ్గర వాళ్లే అతనిమీద ఆకాశరామన్న ఉత్తరం రాసి ఉండవచ్చని అనుకుంటున్నాను. నువ్విప్పుడు అతన్ని ఆదుకున్నా అందరికీ తెలిసిపోయే అవకాశం ఉంది. నీకున్న మంచి పేరు ఈ చిన్న విషయంతో పోగొట్టుకోకు. కొన్నిసార్లు ఆకాశరామన్న ఉత్తరాలు కార్పొరేట్ విజిలెన్స్‌కు వెళ్తుంటాయి. ఈ ఉత్తరం వెళ్తే కేసేమయిందని వాళ్లకు వివరించేవరకు ఊరుకోరు. ఏదో తేలేవరకు కత్తి నా తల మీద వేలాడుతూనే ఉంటుంది. ఆ సమయంలో మా చీఫ్ కూడా నా సహాయానికి రాడు" ఆగాను.

మలయ్యను ఒప్పించడం తేలికయిన పనేమీ కాదు. నిజానికి నేను ధైర్యస్థుడినేంకాదు. ఎంతో ధైర్యస్థుడిలా పరిస్థితిని ఎదుర్కొంటాను. అలాగే మాట్లాడతాను. ధైర్యస్తుడిని కానని ఎదుటి వాడికి తెలియనీయను.

రెండు నిమిషాలు మవునంగా ఉండి, ఫోను అందుకుని డయల్ చేసి, "రాజనరసయ్యా, నేను.. నేనురా... విజిలెన్స్ వాళ్లతో మాట్లాడాను. నువ్వు వెంటనే కంపెనీకి కట్టాల్సిన డబ్బులు కట్టేసేయి...." అని అతను ఏదో మాట్లాడుతున్నా

వినడానికి ఇష్టంలేక  ఫోను పెట్టేశాడు మల్లయ్య. ముఖంలో కోపం కనిపిస్తోంది. ఎవరి మీదో నాకు అర్థం కాలేదు.

మల్లయ్య వాళ్లు వెళ్ళిపోయిన అరగంట తర్వాత ముబారక్ నాకు ఫోను చేసి, "థేంక్యూ గురూ, ఆరాజ నరసయ్య గాడు తనో పెద్ద లీడర్నని విర్రవీగుతోంటే వాడి నడ్డివిరగ్గొట్టావు. మల్లయ్యన్న మీ చీఫ్‌తో మాట్లాడాడు." అన్నాడు.

"అలాగా" అన్నాను.

మరి కొద్దిరోజుల్లో రాజనరసయ్యకన్నా ముందు ముబారక్ గుండూరావు యూనియన్‌లోకి దూకబోతున్న సంగతి మల్లయ్యకు తెలుసో, లేదో?

❖ **తేజ వీక్లీ, 16 జనవరి 2009**